ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 34.0 | కనిష్ఠం : 19.0

ANDHRAJYOTHY 5

జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

మంగళవారం 25 ఫిబ్రవరి 2025





థర్మాకోల్ షీట్స్‌ను తీసుకెళ్తున్న రెస్క్యూ సిబ్బంది



లోకో ట్రైన్‌పై ఎక్స్‌కవేటర్‌ను టన్నెల్ లోపలికి తీసుకెళ్తున్న రెస్క్యూ బృందం

నిరీక్షణ

- టన్నెల్‌లో చిక్కుకున్న వారి పరిస్థితిపై కొనసాగుతున్న ఉత్కంఠ
- మట్టి, ఐరన్‌షీట్లు, సెగ్మెంట్ బ్లాకులు తీయలేకపోతున్న రెస్క్యూ సిబ్బంది
- ఘటనా స్థలానికి బాధిత కుటుంబ సభ్యులు
- కావాలనే రానివ్వడం లేదనే విమర్శ.. ఉద్రిక్తత పెరుగుతుందనే..
- మూడు దఫాలుగా లోపలికి వెళ్లిన వివిధ రెస్క్యూ బృందాలు
- లోపలకు వెళ్లడం.. ప్రణాళికలు రచించడం.. తిరిగి రావడం ఇదే పని

మహబూబ్‌నగర్/అచ్చంపేట/దోమలపెంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం పైకప్పు కూలిన ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మందిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు వారు జీవించి ఉంటారనే ఆశతోనే పని చేస్తున్న రెస్క్యూ బృందాలు పలుమార్లు లోపలకు వెళ్లి వచ్చాయి. కానీ వారి పరిస్థితిపై స్పష్టత రాలేదు. మట్టి, ఐరన్ షీట్లు, సెగ్మెంట్ బ్లాకులు భారీగా పేరుకుపోవడంతో వాటిని తొలగించడం కత్తి మీద సవాల్‌గా మారింది. అవి తొలగించే క్రమంలో పైకప్పు ఇంకా కూలిపోయే ప్రమాదం ఉందని రెస్క్యూ బలగాలు భావిస్తున్నాయి. సొరంగంలో చిక్కుకున్న వారిలో జార్ఖండ్, జమ్ము, యూపీలకు చెందిన వారు ఉన్నారు. వారి కుటుంబ సభ్యులు ఇప్పటికే ఘటనా స్థలం వద్దకు చేరుకుంటారని భావిస్తుండగా.. వారు వస్తే పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందని పోలీసులు వారిని అక్కడకు రానివ్వడం లేదు. కొందరు కుటుంబ సభ్యులు వచ్చినా వేరే ప్రాంతంలో ఉంచినట్లు తెలుస్తోంది. బురద, నీరు ఎక్కువగా ఉండటం.. నిన్నటి కంటే ఎక్కువ నీటి ఊట వస్తుండటంతో పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. శనివారం రాత్రి నుంచి సహాయక బృందాలు టన్నెల్ లోపలికి పలుమార్లు వెళ్లి వస్తున్నప్పటికీ.. ఇప్పటివరకు సరైన ప్రణాళిక సిద్ధం కాలేదు. బురద, మట్టిని ఎలా తొలగించాలి, ఊట నీటిని ఎలా అడ్డుకోవాలి, డీ వాటరింగ్ మరింత వేగంగా ఎలా చేయాలి? అనే విషయాలపైనే ప్రణాళికలు చేస్తున్నారు. అయితే లోపలి వైపు ఏమైనా గ్యాప్‌లు ఉన్నాయా? ఉంటే ఎయిర్ ఫ్లో ఉందా? లోపల ఇరుక్కున్న వారి పరిస్థితిని మరింత క్షుణ్ణంగా తెలుసుకోవడానికి ఉత్తరాఖండ్ మైనింగ్ రెస్క్యూలో ఉపయోగించిన ప్రోబోస్కోప్, పుష్ క్యామ్‌ను పరిశీలిస్తున్నారు. ఎల్‌అండ్‌టీ కంపెనీకి

(మిగతా 6లో..)

అరగంట ఆలస్యమైతే..

- నేనూ ప్రమాదానికి గురయ్యే వాడిని
- నేను నైట్ షిఫ్ట్ ముగించుకొని బయటికి వచ్చాక కూలిన టన్నెల్
- నారాయణపేట జిల్లాకు చెందిన కార్మికుడు మంగు శ్రీకాంత్

6

మునిసిపాలిటీల్లో ముమ్మరంగా
ఆస్తిపన్ను వసూలు

- వందశాతం లక్ష్యంగా కసరత్తు చేస్తున్న అధికారులు
- 40 శాతం కూడా దాటని గద్వాల మునిసిపాలిటీ
- వడ్డేపల్లిలో 75శాతం వసూలు



గద్వాల పట్టణ మునిసిపల్ కార్యాలయం

గద్వాల టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలకు స్థానికంగా లభించే ప్రధాన ఆదాయాల్లో ఒకటైన ఆస్తి పన్ను.. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో ఆస్తి పన్ను వసూళ్లను అధికారులు ముమ్మరం చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గద్వాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి నాలుగు మునిసిపాలిటీలు ఉన్నాయి. వీటిద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏరియర్స్, జరిమానాలతో కలిసి మొత్తం రూ.12.09 కోట్ల మేర పన్ను రూపంలో వసూలు కావాల్సి ఉంది. ఒక్క వడ్డేపల్లి మునిసిపాలిటీలో మాత్రమే 75శాతం వసూలు చేశారు. అయిజలో 40శాతం, అలంపూర్‌లో 54శాతం వసూలు కాగా, గద్వాల పట్టణంలో 40 శాతం కూడా దాటక పోవడం గమనార్హం.

● గద్వాల : గద్వాల పట్టణంలో నివాస గృహాలు, రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆస్తులు కలిపి మొత్తం పన్ను వసూలు చేయాల్సిన ఆస్తుల సంఖ్య 16,036గా ఉంది. వీటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.4 కోట్ల 44లక్షల13 వేలు వసూలు చేయాల్సి ఉంది. జరిమానా రూపంలో రూ.17.56 లక్షలు, ఏరియర్స్ రూపంలో రూ.2 కోట్ల 15లక్షల 55వేలు రావాల్సి ఉంది. నిబంధనల మేరకు విధించిన జరిమానా రూ.2 కోట్ల 8 లక్షల 56వేలుగా అధికారులు నిర్ధారించారు. దీంతో ఈ ఏడాది వసూలు చేయాల్సిన మొత్తం ఆస్తి పన్ను విలువ రూ.8 కోట్ల 94లక్షల 46వేలు. ఇందులో ఇప్పటివరకు రూ.2కోట్ల 77లక్షల 69వేలు మాత్రమే వసూలు చేశారు.

అలంపూర్ పట్టణంలో నివాస గృహాలు, రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఆస్తులు మొత్తం 3,543లుగా ఉన్నాయి. వివిధ రూపాల్లో వసూలు చేయాల్సిన ఆస్తి పన్ను రూ.48.51లక్షలు కాగా ఇప్పటి వరకు మొత్తం రూ.28.06 లక్షలు వసూలు చేశారు. అయిజ పట్టణంలో నివాస గృహాలు, రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వానికి చెందిన మొత్తం ఆస్తుల సంఖ్య 8,074 ఉండగా వివిధ రూపాల్లో రావాల్సిన ఆస్తి పన్ను రూ.1 కోటి 74 లక్షల 90వేలకు చేరింది. ఇప్పటి వరకు మొత్తం రూ.87.14 లక్షలు వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.87.76లక్షలు వసూలు చేయాల్సి ఉంది. వడ్డేపల్లి పట్టణంలో నివాస గృహాలు, రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్ కలిసి మొత్తం 3,981 ఆస్తుల ద్వారా వివిధ రూపాల్లో వసూలు చేయాల్సిన ఆస్తి పన్ను రూ.96.85లక్షలు కాగా, ఇప్పటి వరకు మొత్తం రూ.73.45 లక్షలు వసూలైంది.

వందశాతం వసూలుకు చర్యలు



గద్వాల మునిసిపాలిటీలో వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. వివిధ కారణాలతో ఏళ్ల తరబడి ఆస్తిపన్ను చెల్లించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. కలెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 1వ తేదీ నుంచి ఆర్థిక సంవత్సరం చివరి వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా వసూళ్లకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

- దశరథ్, గద్వాల మునిసిపల్ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

ప్రతీ ఒక్కరు ఆధార్ కార్డు కలిగి ఉండాలి

- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డు అన్ని సేవలకు కీలకంగా మారిందని, ప్రతీ ఒక్కరు ఆధార్‌కార్డు కల్గి ఉండి, తమ వివరాలను, బయోమెట్రిక్‌ను నవీకరించుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. వీసీ ద్వారా హైదరాబాద్ నుంచి యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ చైతన్యరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి అన్నారు. పుట్టిన శిశువు మొదలుకొని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 5నుంచి 15 సంవత్సరాల లోపు వారు బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఆధార్ కార్డులో చిన్న మార్పులకు నివాస ధ్రువపత్రం సరిపోతుందని, జన్మతేదీ సవరణకు తప్పనిసరిగా జనన ధ్రువపత్రం అవసరం అని స్పష్టం చేశారు. పాఠశాలల్లోని విద్యార్థులందరిని ఆధార్ బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేయించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆధార్‌నమోదు, అప్‌డేట్ కోసం మెగా క్యాంపులు నిర్వహించాలని సూచించారు.

ఇంటర్, పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులకు సూచించారు. మార్చి 5 నుంచి 20 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 12,150 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు అవుతారని తెలిపారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 6,457, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,693 మంది ఉన్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలు, మొత్తం 6,887 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పరీక్షలు రాసే సమయంలో 144 సెక్షన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఉన్నారు.

పెళ్లి ఇంట్లో విషాదం

- రోడ్డు ప్రమాదంలో వరుడి సోదరుడు మృతి
- బైక్‌ను ఢీకొన్న బొలెరో
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మండలంలో ఘటన

7



మురళీమోహన్ (ఫైల్)

రెండు టీఎంసీల నీటి విడుదల

- నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి..
- సోమవారం కృష్ణ మండలానికి చేరిక

7

తుమ్మిళ్ల లిఫ్ట్‌కు సహకరించాలి

ఎస్ఈని కలిసిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలీ ఆచారి
- ఆకట్టుకున్న ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

7



విద్యుత్ దీపాలంకరణలో ముస్తాబైన అలంపూరు అమ్మవారి ఆలయం

7

ఏడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెబ్బేరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిబంధనలు పాటించకుండా, సరైన పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పెబ్బేర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వాసుదేవరావు తెలిపారు. సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా కొత్తకోట, పెబ్బేరు, వనపర్తి ప్రాంతాలకు చెందిన ఏడు ట్రాక్టర్లకు సరైనా పత్రాలు లేకపోవడం, డ్రైవర్లకు లైసెన్స్‌లు లేకపోవడం, వ్యవసాయ అవసరాలకు వినియోగించే ట్రాక్టర్లతో ఇసుకను తరలించడం, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకపోవడంతో పట్టుకున్నట్లు తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించకుండా వాహనాలను నడుపుతున్న ట్రాక్టర్ల యాజమానులపై, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. రోడ్డు నింబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పట్టుబడిన ట్రాక్టర్లతో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, అధికారులు

నిరీక్షణ

(5వ పేజీ తరువాయి)

చెందిన నలుగురు లోపలకు వెళ్లి.. పరిస్థితిని వీడియోల ద్వారా తెలుసుకోనున్నారు.

కొనసాగుతున్న సమీక్షలు.. ప్రణాళికలు..

లోపల చిక్కుకున్న కార్మికులను కాపాడటానికి సాధ్యమైనన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. లోపల లూజ్ సాయిల్ పరిస్థితిని తెలుసుకోవడానికి జియోలాజిస్టును కూడా తీసుకెళ్లారు. అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉదయం 10 గంటలకే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు చేరుకున్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సహాయక చర్యల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు లోపలకు వెళ్లడానికి, సహాయక చర్యలు చేపట్టడానికి కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాయి.



టన్నెల్ లోపలికి వెళ్తున్న రెస్క్యూ బృందం

ఉదయం నుంచి రెండు దఫాలుగా లేబర్‌ను దాదాపు 35 మందిని పంపించగా.. వారు ఆదివారం పంపించిన గ్యాస్ కట్టర్ల సాయంతో ఐరన్ షీట్లను కట్ చేస్తున్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం 3.20 గంటలకు 26 మందితో కూడిన ఎన్‌డీఆర్ఎఫ్, ఎల్అండ్‌టీ, ఎస్డీఆర్ఎఫ్, కంపెనీ సభ్యులతో కూడిన బృందం లోపలకు వెళ్లింది. ఈ టీమ్‌తోపాటు ఒక ప్రోక్లెయిన్‌ను మరో లోకో ట్రెయిన్‌పై అమర్చి పంపించారు. వారు తిరుగు ప్రయాణం అయిన తర్వాత మాత్రమే పూర్తిస్థాయి యాక్షన్ ప్లాన్‌ను నిర్వహించారు. ర్యాట్ హోల్ మైనర్స్ నేవీ కూడా రంగంలోకి దిగింది. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తుండటంతో పరిస్థితి మంగళవారం ఓ కొలిక్కి రావొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బిక్కుబిక్కుమంటూ..

8 మంది తోటివారు.. రోజూ తమతో గడిపేవారు.. టన్నెల్ ప్రమాదంలో చిక్కుకుపోవడంతో అందులో నుంచి బయటపడిన కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కొంత అదృష్టం తమవైపు లేకపోతే తమ పరిస్థితి కూడా అలానే మారేదని అంటున్నారు. అయితే వారి పరిస్థితి ఎలా ఉందో తెలియకపోవడంతో చనిపోయారా? బతికున్నారా? అని వాపోతున్నారు. అన్నింటిలో శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలే లోపలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాయని, అలాంటిది తాము తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ లోపలకు వెళ్లి రోజూ భయం భయంగా పని చేస్తున్నామని తెలిపారు. తమకు భద్రత, భరోసా రెండూ తక్కువగానే ఉంటున్నాయని అంటున్నారు. ఉన్న ఊర్లలో ఉపాధి లేక తక్కువ వేతనాలకు ఇంత దూరం వచ్చామని చెబుతున్నారు. సమయానికి డబ్బులు ఇవ్వకున్నా.. ఆశతో పనిచేస్తున్నామని ఆవేదన చెందుతున్నారు.

అరగంట ఆలస్యమైతే..

● నేనూ ప్రమాదానికి గురయ్యే వాడిని

● నారాయణపేట జిల్లాకు చెందిన కార్మికుడు మంగు శ్రీకాంత్



దామరగిద్ద, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆలస్యమైతే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదంలో నేనూ చిక్కుకునేవాడినని అక్కడ పని చేస్తున్న నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన మంగు శ్రీకాంత్ తెలిపారు. సోమవారం గ్రామానికి వచ్చిన అతను ప్రమాదంపై విలేకరులతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద తాను రెండేళ్లుగా పని చేస్తున్నట్లు చెప్పాడు. ఈ నెల 22న శనివారం అర్ధరాత్రి టన్నెల్‌లో 40 మంది కార్మికులతో పాటు తాను విధులు నిర్వహించేందుకు వెళ్లామన్నారు. నైట్ షిఫ్ట్ ముగించుకుని, ఆదివారం ఉదయం 8.10 గంటలకు తాము బయటకు వచ్చామన్నారు. తాము బయటకు వచ్చిన అరగంటలోపే టన్నెల్ పైకప్పు కూలి, ప్రమాదం జరిగిందని చెప్పాడు. టన్నెల్ లోపల 14వ కిలో మీటర్ వద్ద టన్నెల్ పైకప్పు కూలడంతో ఒక్కసారిగా అరుపులు కేకలతో 32 మంది కార్మికులు పరిగెత్తుకుంటూ బయటకు వచ్చారని అన్నాడు. ఎనిమిది మంది కార్మికులు టన్నెల్ లోనే ఇరుక్కొని పోయారని తెలిపాడు. తనకు తెలిసిన ప్రకారం సొరంగంలో మట్టి తీయడానికి చాలా సమయం పడుతుందని అన్నాడు.

కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీల్లో రన్నర్‌గా కందనూలు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్‌లో ఈ నెల 22వ తేదీన జరిగిన 34వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ విభాగంలో బాలుర జట్టు నాగర్‌కర్నూల్ జిల్లా ద్వితీయ స్థానం సాధించింది. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి బాలుర జట్టు పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్ర వికారాబాద్ జిల్లాలో నిర్వహించిన 34వ సబ్ జూనియర్ కబడ్డీ బాలుర విభాగంలో నల్గొండ జిల్లా ప్రథమ స్థానం సాధించగా నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించిందని క్రీడాకారులు తెలిపారు. ద్వితీయ స్థానం సాధించిన జట్టులో పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్ల గ్రామ విద్యార్థి తలారి హరీష్, ఫైనల్ మ్యాచ్ వరకు అందరికన్నా ఎక్కువ ప్రతిభ కనబర్చినందున రన్నర్‌గా షీల్డ్‌ను బహుమతి అందుకున్నాడు.

ప్రమాదకరమైన కంపెనీ

అనుమతి రద్దు చేయాలి

● చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ధర్నా



చిన్నచింతకుంటలో మాట్లాడుతున్న రవిచంద్ర

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిత్తనూర్ ఇథనాల్ కంపెనీకి అనుబంధంగా సింథటిక్ కెమికల్స్ కంపెనీకి ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఎక్లాస్‌పూర్ రైతు మండలి నాయకుడు బండారు మల్లేష్ అధ్యక్షత వహించారు. సింథటిక్ కెమికల్ కంపెనీ అనుమతులు రద్దు చేయాలని, కోయిల్‌సాగర్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందివ్వాలన్నారు. రైతులు, పోరాట కమిటీ ప్రతినిధులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పీపుల్స్ జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ రవిచంద్ర మాట్లాడుతూ సింథటిక్ పరిశ్రమను ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా చేపట్టారన్నారు. పాలమూరు అధ్యయన కమిటీ వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ పాలకులు గత బీఆర్ఎస్ అయినా, కాంగ్రెస్ ప్రభుత్వమైనా జిల్లా రైతాంగంపై కక్షగట్టి ప్రవర్తిస్తున్నట్లు తెలిపారు. భూములు చౌకగా పరిశ్రమల పేరుతో పెట్టుబడిదారులకు ఇస్తున్నారన్నారు. బీడు భూములకు నీళ్లు పారించటం లేదని ఆరోపించారు. కోయిల్‌సాగర్, భీమా, పాలమూరు, రంగారెడ్డి, నారాయణపేట, కొండంగల్ ప్రాజెక్టులను పూర్తిచేయకుండా జిల్లా ప్రజలను నిండా ముంచుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎల్లయ్యకు అందజేశారు. కార్యక్రమంలో ఖలీల్, సంతోష్‌రెడ్డి, మన్యంకొండ, మహదేవ్ పాల్గొన్నారు.

టైర్లు పేలి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

జడ్చర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : 44వ నెంబరు జాతీయ రహదారిపై మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టైర్లు పేలడంతో మంటలు రేగాయి. ఈ మంటలతో బస్సు పూర్తిగా దగ్ధం అయ్యింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన నలీమ్ ట్రావెల్స్‌కు బస్సు ఆదివారం రాత్రి 8:30 గంటలకు బెంగళూరు నుంచి ఇద్దరు డ్రైవర్లతో 38 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. తెల్లవారుజామున 4:30 గంటలకు మల్లెబోయిన్‌పల్లి సమీపంలోకి రాగానే బస్సు కుడివైపున ఉన్న టైర్లు పగిలి మంటలు రేగాయి. ప్రయాణికులు మంటలను గమనించి, డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే బస్సును రోడ్డు పక్కన నిలిపివేసి, మంటలు ఆర్పేందుకు డ్రైవర్లు, ప్రయాణికులు ప్రయత్నించారు. సమీపంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేసేవారు మంటలను అదుపులోకి తీసుకువచ్చే పరికరాలతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. జరిగిన సంఘటన సమాచారాన్ని పోలీసు శాఖకు, అగ్నిమాపక శాఖకు చేరవేశారు. సంఘటనా స్థలానికి జడ్చర్ల సీఐ కమలాకర్, ఎస్ఐ చంద్రమోహన్‌లతో పాటు జడ్చర్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా ఈ సంఘటనలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులోని లగేజ్‌బాక్స్‌లో ఉన్న ప్రయాణికుల లగేజ్ అగ్నికి ఆహుతి అయ్యింది. జాతీయరహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. రేగిన మంటలను తాము గమనించని పక్షంలో పెద్ద ప్రమాదం జరిగి భారీగా ప్రాణ నష్టం వాటిల్లేదని ప్రయాణికులు చెప్పారు. ప్రైవేట్ ట్రావెల్స్ మేనేజర్ చెన్నారాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హామీలు గాలికి వదిలేసిన కేంద్రం

● తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర పద్రాన కార్యదర్శి టి.సాగర్

నారాయణపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ప్రాజెక్టులకు జాతీయ హోదా, హైస్పీడ్ రైల్వేలైన్ తదితర కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేసేందుకు కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించలేదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ విమర్శించారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో గోపాల్ అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సులో సాగర్ ముఖ్య వక్తగా హాజరై, ప్రసంగించారు. వ్యవసాయ రంగంలో సబ్సిడీలను తగ్గించి జాతీయ గ్రామీణ ఉపాధికి సంబంధించి సరిపడా నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఆకలి సూచిలో భారతదేశం 105వ స్థానంలో ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా లక్ష మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. వ్యవసాయ పరిశోధనను ప్రైవేటు వారికి అప్పచేప్పేందుకు నిర్ణయించారని, బడా పారిశ్రామికవేత్తలకు 22 శాతం పన్ను, ఉద్యోగస్తులకు మాత్రం 30 శాతం పన్ను వేస్తున్నారన్నారు. ధరల స్థిరీకరణకు నిధులు కేటాయించడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పప్పులు, నూనెలు విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయన్నారు. 14 రకాల నిత్యావసర వస్తువులు చౌకధర దుకాణాల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రామ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిలయ్య గౌడ్, గోవింద్‌రాజ్, దస్తప్ప, శివకుమార్, అశోక్, బాలరాం, నరహరి పాల్గొన్నారు.

పశువుల కంటైనర్ పట్టివేత

మూసాపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా 35 ఎద్దులను తరలిస్తున్న కంటైనర్‌ని పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా హైదరాబాద్ నుంచి అనంతపూర్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. యాజమాని మన్సూర్, డ్రైవర్ రాజన్‌లను విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఎద్దులను వెల్దండలోని గురునాయక్ గోశాలకు తరలించారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో అన్ని కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఇందిర సూచించారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో బ్యాంక్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ లోక్‌అదాలత్‌లో బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసులన్నింటిని పరిష్కరించాలని కోరారు. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకుల దుర్మరణం



చరణ్‌రెడ్డి, అనిల్(ఫైల్)

భూతా్పూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి): బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృ చరణ్‌రెడ్డి (ఫైల్)తి చెందిన ఘటన సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని తాటికొండ శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన చరణ్‌రెడ్డి(23), స్నేహితుడైన అనిల్ (23) కలిసి బైక్‌పై కొత్తకోట నుంచి సాయంత్రం హైదరాబాద్‌కు బయలుదేరారు. భూత్పూర్ మండలంలోని తాటికొండ శివారులో ఉన్న బ్రిడ్జి వద్దకు రాగానే రోడ్డు పక్కన ఉన్న ఇనుప డివైడర్‌ను అదుపు తప్పి ఢీకొన్నారు. చరణ్‌రెడ్డి గొంతుకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా అనిల్ తండ్రి 18 రోజుల క్రితం మృతి చెందాడు. ఇప్పుడు కుమారుడు చనిపోవడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం మిగిలింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా

● కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక స్వావలంబన ● కుట్లు, అల్లికలలో మహిళలకు శిక్షణ



మహిళలకు శిక్షణ ఇస్తున్న రాజ్యలక్ష్మి

వడ్డేపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. రంగం ఏదైనా సరే ఏకాగ్రతతో మెళకువలు నేర్చుకుని తమదైన శైలిలో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో విద్యావంతులైన మహిళలు సైతం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా తమకు నచ్చిన వృత్తిని ఎంచుకుని రాణిస్తున్నారు. మరికొందరికి స్వయం ఉపాధి చూపుతూ వారికి అండగా నిలుస్తున్నారు. వృత్తిలో రాణిస్తున్న మహిళలు ఆర్థిక పరిపుష్టితో పురుషులతో సమానంగా కుటుంబానికి చేదోడువాడోడుగా నిలుస్తున్నారు.

వడ్డేపల్లి మునిసిపాలిటీ గ్రామమైన పైపాడుకు చెందిన రాజ్యలక్ష్మి డిగ్రీ వరకు విద్యను అభ్యసించారు. ప్రభుత్వ ఉద్యోగం రాలేదని నిరుత్సాహ పడకుండా కుట్టుమిషన్‌పై శిక్షణ పొందింది. తాను స్వయం ఉపాధిని పొందుతూ నలుగురికి ఉపాధిని చూపే వృత్తిని చేపట్టింది. వందలాది మంది మహిళలకు ఉపాధి కల్పిస్తుండటం గమనార్హం. సదరు మహిళ తన భర్త సహకారంతో శాంతినగర్‌లో రెండు షాపులను తీసుకుని కొందరు మహిళలకు శిక్షణ ఇస్తుంది. కాగా, శిక్షణ పొందినటువంటి కొందరు మహిళలు స్వయంకృషితో జీవనం సాగిస్తున్నారు. కుట్టుమిషన్‌తో పాటు వచ్చినటువంటి మహిళలకు రకరకాల అల్లికలతో పాటు నూతన డిజైన్లను కూడా వారికి నేర్పిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు వంద మందికి పైగా శిక్షణ ఇచ్చింది. మూడు నెలల శిక్షణ కాలానికి ఒక గ్రూప్ ప్రకారం కొనసాగే ఈ శిక్షణలో కటింగ్, కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీలలో కూడా శిక్షణ ఇస్తున్నారు. కొత్తకొత్త అల్లికల కోసం కావలసిన పరికరాల కోసం హైదరాబాద్, మహబూబ్‌నగర్, కర్నూలు వంటి ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. పిల్లల దుస్తులు, కొత్తకొత్త డిజైన్లతో కూడిన డ్రస్సులను కూడా ఈమె అమ్ముతుంది. శిక్షణ పొందుతున్నటువంటి మహిళలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందించి బాసటగా నిలవాలని కుట్టు శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు కోరుతున్నారు.

ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు : ప్రశాంతి

చదువుతో పాటు సెలవుల సమయంలో కుట్టుమిషన్ నేర్చుకుంటే ఆర్థికంగా కొంతవరకు నిలదొక్కుకోవచ్చు. నిర్వాహకురాలు దగ్గర ఏకాగ్రతతో నేర్చుకుంటే మూడు నెలల సమయం సరిపోతుంది. స్వయం ఉపాధి వలన ఒకరిపై ఆధారపడ కుండా స్వయంగా జీవనం కొనసాగించవచ్చు.

బాగా ఉపయోగపడుతుంది : పల్లవి

ఎనిమిది నెలలుగా శిక్షణ పొందడంతో పాటు కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ, కటింగ్ అన్నీ పూర్తిగా నేర్చుకున్నాను. ప్రస్తుతం అన్ని రకాల డ్రెస్సులను, అల్లికలు చేస్తున్నాను. ఇలా కుట్టుమిషన్ నేర్చుకోవడం కుటుంబానికి ఆర్థికంగా కూడా ఉపయోగపడుతుంది.

శిక్షణతో స్వయం ఉపాధి



శిక్షణ పొందుతున్న మహిళలు ఒకరిపై ఆధారపడకుండా స్వయం ఉపాధి పొందుతారు. కుటుంబ పోషణకు చేదోడువాడోడుగా ఉంటుంది. శిక్షణ పొందినటువంటి మహిళలు సక్రమంగా నేర్చుకోకపోతే మళ్లీ రెండు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. ఉపాధి పొందుతున్నటువంటి మహిళలకు సామగ్రి మొత్తాన్ని సమకూరుస్తున్నాను. మహిళలకు ప్రోత్సాహమిచ్చే సంస్థలు ఉంటే బాగుంటుంది.

- రాజ్యలక్ష్మి, నిర్వాహకురాలు

23 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీరెల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం రేషన్ బియ్యం పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు బీరెల్లి గ్రామం నుంచి కర్నూల్‌కు 23 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. విచారణలో శ్రీరామ్ అనే వ్యక్తి వీటిని సేకరించి తరలిస్తున్నట్లు తేలడంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

జోగులాంబను దర్శించుకున్న ప్రముఖులు



గద్వాల సంస్థానం వారికి అమ్మవారి చిత్రపటాలు ఇస్తున్న ఈఓ

అలంపూరు, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గద్వాల సంస్థానం వంశస్థులు శ్రీకృష్ణ రాంభూపాల్, బుల్లితెర నటుడు, నిర్మాత శ్రీరామ్, ఆర్యవర్ధన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వీరికి ఆలయ ఈవో పురేందర్ కుమార్, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి గణపతి పూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిరంజన్‌రెడ్డిపై నిందలు సరికాదు

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి నిందలు మోపడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. చిన్నారెడ్డికి ఆ పార్టీ ఎమ్మెల్యే మేఘారెడ్డితో టికెట్ విషయంలో గొడవ మొదలుకొని ఇప్పటికీ అభివృద్ధి చేయకుండా నియోజకవర్గాన్ని ఇద్దరు భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలోని రంజన్‌రెడ్డి చేసిన అభివృద్ధే కనిపిస్తుందని తెలిపారు. నిరంజన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్న చిన్నారెడ్డి, మేఘారెడ్డిలపై పరువు నష్ట దావా వేస్తామని హెచ్చరించారు.

11 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రాజోలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పు గార్లపాడు గ్రామ శివారులో ఇసుక కోసం అక్రమంగా నదిలోకి దిగిన 11 ట్రాక్టర్లు, ఒక మినీ టిప్పర్‌పై కేసు నమోదు అయినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఇసుక అవసరాల కోసం రాజోలి మండలంలోని తూర్పు గార్లపాడు గ్రామం శివారులో ఉన్న తుంగభద్ర నదిలో ఇసుకను తీసేందుకు ప్రభుత్వం ఇసుక రీచ్ ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకున్న వారికి వారు ఎంచుకున్న ట్రాక్టర్లు ఇక్కడి నుంచి ఇసుకను లోడ్ చేసుకుని వెళ్లి డెలివరీ చేయాల్సి ఉంది. కాగా, తూర్పు గార్లపాడు గ్రామంలో ఇసుకకు వెళ్లే ముందు ట్రాక్టర్లకు ఉదయం 7గంటలకు మెసేజ్ వచ్చాకే నదిలోకి దిగాల్సి ఉంది. సోమవారం తెల్లవారు జామున నదిలోకి ట్రాక్టర్లు దిగి ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ జగదీశ్వర్ తన సిబ్బందిని నదిలోకి పంపారు. అక్కడ అక్రమంగా నదిలోకి దిగిన 11 ట్రాక్టర్లు, ఒక మినీ టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని రాజోలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాటిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



నదిలో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

గ్రామాల్లో హైమాస్ట్ లైట్ల వెలుగులు



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెద్దమందడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి, చీకరుచెట్టు తండా, వీరాయిపల్లి గ్రామాలలో సోమవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ2 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసి ఈ లైట్లతో గ్రామ కూడళ్ల వద్ద వెలుగులతో గ్రామం కళకళలాడుతోందని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సిద్దయ్య, తిక్కన్న, రాధాకృష్ణ, తిరుపతిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం

- చారకొండ నిర్వాసితులకు తహసీల్దార్ అద్దంకి సునీత హామీ
- తాత్కాలికంగా దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించిన సీపీఎం, సీపీఐ నాయకులు

చారకొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారి (167)లో భాగంగా చారకొండ నుంచి మర్రిపల్లి వరకు బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆదుకుంటామని తహసీల్దార్ అద్దంకి సునీత అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, సీపీఐ జిల్లా సమితి నాయకుడు చిలివేరు శ్రీనివాసులు, నాయకులు బాధితులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు బైపాస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన 29 మంది బాధితులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు తాత్కాలికంగా విరమింపజేస్తున్నట్లు సీపీఎం, సీపీఐ తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకొని బైపాస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన బాధితులకు 2018 లో అప్పటి సర్పంచ్ సర్వే నంబరు 80/ఏ/1లో 155 గజాల ఇంటిస్థలాలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇచ్చారని, ఆ ఇళ్ల జాగలకు పొజిషన్ చూపించాలని ఎంపీవో వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీటీ విద్యాధరరెడ్డి, బాధితులు నల్ల కిరణ్, రాములమ్మ, అన సూయమ్మ, వెంకటమ్మ, సుమతమ్మ, లాలమ్మ, లింగమయ్య పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

- తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మేష్

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మేష్ నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని యాదవ భవనంలో తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం 3వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగం, వ్యవసాయ రంగంలో రాష్ట్రంలో సుమారుగా 30 లక్షల మందికి పైగా జీవిస్తున్నారని అన్నారు. వీరి కోసం 1996లో చట్టం వచ్చిందని, అది ఉమ్మడి రాష్ట్రంలో 2009 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. నిర్మాణ రంగా కార్మికుల తెలివి చాలా అమూల్యమైందన్నారు. సంక్షేమ బోర్డులో జమ అయిన నిర్మాణ కార్మికుల డబ్బులను, నిర్మాణ కార్మికుల కోసం మాత్రమే ఖర్చు చేయాలని సూచించారు. అదేవిధంగా 2009 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో మన తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేలాది మంది కార్మికులకు కొన్ని వేల కోట్ల రూపాయలను ఇప్పించడంలో మన సంఘం ముందు వరుసలో ఉందన్నారు. అలాగే కార్మికుల పెండింగ్ దరఖాస్తుల విషయంలో కూడా కార్మికులను తీసుకు వెళ్లి, అధికారులను నిలదీసి, సమస్యలు పరిష్కరించడంలో కూడా మన సంఘం ముందు ఉందన్నారు. ఈ పిలుపులో కార్మికులంతా వచ్చి మన హక్కులను సాధించుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడిమాడ కిష్టన్న, ఉపాధ్యక్షుడిగా వాకిటి రంగన్న, ప్రధాన కార్యదర్శిగా సి. రాజు, సహాయ కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారిగా మన్యం, కార్యవర్గ సభ్యుడిగా తిరుపతి, కావలి రాజు, యాదయ్య, రఫీం దర్ గౌడ్, జిలాని తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్ర మంలో నాయకులు సామెల్, భక్తరాజు, శ్రీను, రాజు, నాగయ్య, నాగన్న, మాసన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ!

▸ రేపు మహా శివరాత్రి పర్వదినం ▸ ప్రముఖ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి ▸ అలంపూర్‌లో వచ్చే నెల 1 వరకు ఉత్సవాలు




విద్యుత్ దీపాల వెలుగులో అలంపూర్ స్వాగత ద్వారం, రాజోలిలోని అడివేశ్వర స్వామి

అలంపూరు/ రాజోలి/ మక్తల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : హరహర మహాదేవ అంటూ ఈశ్వర సామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగనున్నాయి. ఈ నెల 26న శివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలంపూర్‌లోని నవబ్రహ్మ ఆలయాలతో పాటు ప్రాంగణం, ప్రవేశ ద్వారాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం నుంచి మార్చి 1వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. అందుకోసం ఆలయంలోని గణపతి, వీరభద్ర, నంది, యాగశాల, నవగ్రహ మండపాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు గోపూజ, ఆలయ ప్రదక్షిణ, అనతి స్వీకరణ, ఆలయ ప్రవేశం, అంకురార్పణ, భేరీ పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో పురేందర్ కుమార్, చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, తెలిపారు. అలాగే ఉత్సవాల నిర్వహణకు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ మంజుల, మునిసిపల్ కమిషనర్ పి.చంద్రశేఖర్‌రావు ఎస్ఐ వెంకటస్వామి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి

అడివేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రంలో శివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 26న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం మహా శివరాత్రి నాడు స్వామి వారి కల్యాణంతో ఉత్సవాలు ప్రారంభమై, 10 రోజుల పాటు కొనసాగనున్నాయి. అందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 27న కలశారోహణం, వచ్చేనెల ఒకటిన రాత్రి రథోత్సవం 2న రాత్రి ప్రభోత్సవం నిర్వహించనున్నారు. మూడవ తేదీన రాత్రి రాజోలి భజన బృందం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భజన పోటీలు ఏర్పాటు చేయనున్నారు. అదే రోజు బిందెసేవ, జలక్రీడలు, నందికోలు సేవ కార్యక్రమాలు ఉంటాయి.

కుంభేశ్వరాలయంలో విశేష పూజలు

▸ గుడిలో అరుదైన బ్రహ్మసూత్ర శివలింగం



మక్తల్ పట్టణంలోని కుంభేశ్వరాలయం

నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని శివాజీ నగర్‌లో వెలసిన కుంభేశ్వరాలయంలో అరుదైన బ్రహ్మసూత్ర శివలింగం ఉంది. వరంగల్‌లోని వెయ్యి స్తంభాల గుడిని పోలి ఉండే ఈ ఆలయంలో శివ రాత్రి సందర్భంగా విశేష పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వెంకటేశ్వరాచారి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 25న మహా మృత్యుంజయ హోమం, కలశాభిషేకం నిర్వహించనున్నారు. శివరాత్రి పండుగ రోజు శివపార్వతుల కల్యాణం, స్పర్శ దర్శనం ఉంటాయి. రాత్రి జాగారం, అఖండ భజన నిర్వహించనున్నారు. 27న పంచామృతాభిషేకం, అన్నదాన కార్యక్రమం ఉంటాయి.

క్రైం కార్నర్

పెళ్లి ఇంట్లో విషాదం

▸ రోడ్డు ప్రమాదంలో వరుడి సోదరుడు మృతి

▸ మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

వడ్డేపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పచ్చని తోరణాలు, బాజా భజంత్రీలు, బంధుమిత్రులు నడుమ వివాహ వేడుక పూర్తి అయి ఒక్క రోజు గడవక ముందే ఆ ఇంట్లో తీరని విషాదం నెలకొన్నది. రోడ్డు ప్రమాదంలో వరుడి సోదరుడు మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మండలం బుడమర్సు గ్రామంలో సోమవారం ఈ విషాద సంఘటన జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సుభద్రమ్మ, రాజన్న దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడైన జానకి రాముడి వివాహం ఆదివారం జరిగింది. సోమవారం వరుడి సోదరుడు మురళీమోహన్ (16) మేనత్త శిరీష, మామ రాజులతో కలిసి బుడమర్సు నుంచి శాంతినగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, బస్టాండ్ సమీపంలో బొలెరో వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో మురళీమోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆనంద సమయంలో జరిగిన ఈ దుర్ఘటనతో పెళ్లి వారింట్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మురళీమోహన్ శాంతినగర్‌లోని శాంతినగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగశేఖర్ తెలిపారు.

బోర్‌వెల్ వాహనం బోల్తా

▸ ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన కూలీ మృతి

వడ్డేపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : బోర్‌వెల్ వాహనం అదుపుతప్పి బోల్తా పడి, హెల్పర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన దీన్‌బంధు(18) బోర్‌వెల్ వాహనంలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున మరో చోట బోరు వేసి గ్రామానికి తిరిగి వస్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంలోని హెల్పర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి మృతుడి తమ్ముడు బాసుదేవ్ బగెల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగశేఖర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

హన్వాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ, రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పందుతూ మృతి చెందారు. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలోని నాయినోనిపల్లి గ్రామానికి చెందిన కంటం సత్యమ్మ (65) కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురయ్యింది. ఈనెల 19న పురుగుల మందు ఆత్మహత్యాయత్నం చేసింది. చుట్టుపక్కల వారు గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

- నవాబ్‌పేట మండలంలోని అమ్మాపూర్ గ్రామానికి చెందిన అంకూరి కృష్ణయ్య ఈనెల 19న రాత్రి మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. అదే సమయంలో సమీర్ అనే యువకుడు బైక్‌పై వస్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో కృష్ణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు మణికంఠ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ విక్రం తెలిపారు.

భార్యపై వేధింపులు, భర్త అరెస్టు

మద్దూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : భార్యను వేధించిన కేసులో భర్తను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, మద్దూర్ మండలంలోని హన్మానాయక్ తండాకు చెందిన భాస్కర్‌నాయక్ తాగుడుకు బానిసై నిత్యం భార్య దేవీబాయిని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 28న మద్యం తాగి వచ్చి భార్యపై దాడి చేసి గాయపరిచాడు. ఈ విషయంపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడు భాస్కర్‌ను అరెస్ట్ చేసి కోస్గి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

బొలెరో బోల్తా పడి ఒకరి మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న బొలెరో వాహనం

కొత్తపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : బొలెరో వాహనం బోల్తాపడి ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. నారాయణపేట జిల్లా, నిడ్జింత తండా సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు నుంచి కొత్తపల్లి వైపు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం నిడ్జింత తండా సమీపంలో అదుపుతప్పి రెండు బోల్తాలు కొట్టి మళ్లీ నిలబడింది. వాహనంలో ప్రయాణిస్తున్న మద్దూరు గ్రామానికి చెందిన బైండ్ల రాములు (45) మీద సిమెంట్ బస్తాలు పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. సమాచారం అందుకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, మృతదేహాన్ని నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కేసరి సముద్రంలో మహిళ మృతదేహం

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కేసరి సముద్రంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం (38) లభించినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఎవరికైనా ఆనవాళ్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

విశ్వకర్మ కరుణించేనా?

▸ లబ్ధిదారుల ప్రకటనలో జాప్యం ▸ వనపర్తి జిల్లాలో 5,273 దరఖాస్తులు ▸ ఎంపిక చేసి పంపించామంటున్న అధికారులు





ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన దరఖాస్తుదారులు

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అమలులో తీవ్ర జాప్యం నెలకొన్నది. దీంతో దరఖాస్తుదారులు 18 నెలలుగా ఎదురుచూస్తున్నారు. కుల, చేతి వృత్తిదారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 2023, సెప్టెంబర్ 17న ప్రారంభించారు. అందుకోసం అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించిన అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించారు. కానీ ఇప్పటి వరకు అక్కడి నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికకే ఇంత సమయం పడితే, అభ్యర్థులకు శిక్షణ, రుణాల మంజూరుకు ఇంకా ఎంత కాలం పడుతుందని ప్రశ్నిస్తున్నారు.

18 రకాల వ్యాపారులకు రుణాలు

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా 18 రకాల వ్యాపారులకు రుణ సదుపాయం అందించనున్నారు. ప్రధానంగా స్వర్ణకారులు, వడ్రంగులు, కమ్మరులు, కుమ్మరులు, రజకులు, దర్జీలు, చెప్పులు కుట్టేవారు, చీపుర్లు, బొమ్మలు, పూలదండలు, పడవలు, చేపలు పట్టే వలలు తయారు చేసేవారు, శిల్పులు, రాళ్లు పగలగొట్టేవారు, చెప్పులు కుట్టేవారు, బట్టలు, చాపలు, చీపుర్లు, బొమ్మలు, పూలదండలు తయారు చేసే వారు తదితర వృత్తిదారులకు ప్రోత్సాహం అందిస్తారు. ఎంపికైన లబ్ధిదారులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తారు. ఆధునిక పరికరాల కొనుగోలు కోసం రూ.15వేల ఆర్థిక సహాయంతో పాటు, లక్ష రూపాయల వరకు రుణం మంజూరు చేస్తారు.

సంప్రదాయ వృత్తిదారులు అర్హులు

ఈ పథకానికి స్వయం ఉపాధి ప్రాతిపదికన అసంఘటిత, అనధికారిక రంగం, కుటుంబ ఆధారిత సాంప్రదాయ వృత్తిదారులు, హస్తకళాకారులు అర్హులు. రిజిస్ట్రేషన్ తేదీ నాటికి లబ్ధిదారుడి కనీస వయసు 18 సంవత్సరాలు నిండి, సంబంధిత వృత్తిలో నిమగ్నుడై ఉండాలి. అలాగే గత ఐదు సంవత్సరాలలో స్వయం ఉపాధి, వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి రుణాలనూ పొంది ఉండకూడదు. అయితే తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించిన వారు, ముద్ర, స్వానిధి లబ్ధిదారులు ఈ పథకానికి అర్హులు. ప్రభుత్వ ఉద్యోగితో పాటు, వారి కుటుంబసభ్యులు అర్హులు కారు.

వనపర్తి జిల్లాలో 5,273 దరఖాస్తులు

వనపర్తి జిల్లా వ్యాప్తంగా మీ సేవ కేంద్రాలతో పాటు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటి వరకు 5,273 మంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీటిని గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి అర్హులను గుర్తించారు. మొదటి దశలో వచ్చిన 5,273 దరఖాస్తులలో 2,149 మంది లబ్ధిదారులను గుర్తించారు. వారిని ఎంపిక చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులకు జాబితాను పంపించారు. కానీ ఇప్పటివరకు లబ్ధిదారులను ప్రకటించలేదు.

త్వరలో మంజూరయ్యే అవకాశం



ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి సంబంధించిన దరఖాస్తుదారుల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి ఉన్నతాధికారులకు జాబితా పంపించాం. ఎంపిక చేసిన లబ్ధిదారుల లాగిన్ కలెక్టర్ పరిధిలో ఉంటుంది. ఈ పథకం కేంద్రం పరిధిలో ఉంటుంది. కాబట్టి లబ్ధిదారుల ఎంపిక ఆలస్యం అవుతోంది. త్వరలో అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణాలు అందుతాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- జ్యోతి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్

సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం

▸ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలీ ఆచారి ▸ ఆకట్టుకున్న ఎద్దుల బల ప్రదర్శన పోటీలు



పశు బలప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న షేక్షావలి ఆచారి

అయిజ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ పశుబల ప్రదర్శన పోటీలు నిర్వహించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షెక్షావలీ ఆచారి అన్నారు. అయిజ పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సీనియర్ విభాగంలో నిర్వహించిన పశు బల ప్రదర్శన పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశ సంపద పెంపునకు వ్యవసాయంతో పాటు, పశువులు, రైతులు ప్రధానమన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న అఖండ సినిమాలోని బసవ ఎద్దులను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పోటీలో 11 జతల ఎద్దులు

కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి 11 జతల ఎద్దులు బల ప్రదర్శన పోటీల్లో పాల్గొన్నాయి. కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా, పల్కమ్‌దొడ్డి గ్రామానికి చెందిన ఖాజాహుస్సేన్ ఎద్దులు బండను 3,943.7 ఫీట్లు లాంగి ప్రథమ స్థానంలో నిలిచాయి. రాయలసీమలోని అనంతపురం జిల్లా, ఏ-నారాయణపురం గ్రామానికి చెందిన షేక్‌మహ్మద్ ఫరీద్ ఎద్దులు 3,940.10 ఫీట్లు లాగి ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకున్నాయి. ఏపీలోని నంద్యాల జిల్లా గుంపురమాన్‌దిన్నె గ్రామానికి చెందిన కుందూర్ రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు 3,900 ఫీట్లు లాగి మూడవ స్థానం, బాపట్ల జిల్లా ఎనమెట్ల గ్రామానికి చెందిన కేవీఆర్ ఎద్దులు 3,800 ఫీట్లు లాగి నాలుగవ స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దులకు లక్ష రూపాయలు, రెండవ స్థానం పొందిన ఎద్దులకు రూ.70,016, మూడవ స్థానాన్ని సొంతం చేసుకున్న ఎద్దులకు రూ. 50,016, నాలుగవ స్థానం దక్కించుకున్న ఎద్దులకు కింద రూ.30,016 నగదు బహుమతులను అందించారు.

భూములు పోతే బతికేదెలా?

▸ సర్వే అధికారులను అడ్డుకున్న కాట్రేవ్‌పల్లి రైతులు

▸ పెట్రోల్ బాటిళ్లు పట్టుకొని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

మక్తల్ రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంపై ఆధారపడి జీవనం గడుపుతున్న తాము భూములను కోల్పోతే బతికేదెలా అని మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లి గ్రామ రైతులు అధికారులను నిలదీశారు. సర్వేను అడ్డుకున్నారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లి శివారులో పంప్‌హౌస్ నిర్మించనున్నారు. అందుకోసం భూములను సర్వే చేసేందుకు అధికారులు సోమవారం గ్రామానికి చేరుకున్నారు. సర్వే చేసేందుకు సిద్ధమవుతున్న వారిని రైతులు అడ్డుకున్నారు. భూములు తీసుకుంటే తాము జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే కొనసాగిస్తే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడతామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, తహసీల్దార్ సతీశ్‌కుమార్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి నచ్చచెప్పేందుకు యత్నించారు. ఫలితం లేకపోవడంతో కలెక్టర్‌తో మాట్లాడుదామని వారిని నారాయణపేటకు తీసుకెళ్లారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కల్వకుర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి న్యాయాధికారి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన గణేష్ మద్యం తాగి, వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని సోమవారం కోర్టులో హాజరు పరచగా, రెండు రోజుల జైలు శిక్ష, వంద రూపాయల ఫైన్ విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు టీఎంసీల నీటి విడుదల



కృష్ణ గ్రామం వద్ద నదిలోకి వచ్చి చేరుతున్న నీరు

కృష్ణ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రంలోని నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి ఆదివారం ఉదయం రెండు టీఎంసీల నీటిని దిగువన కృష్ణానదికి విడుదల చేశారు. ఆ నీరు సోమవారం ఉదయానికి నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోకి చేరింది. స్థానికంగా కృష్ణ, భీమా నదుల్లో నీరు లేకపోవడంతో బండరాళ్లు తేలాయి. దీంతో నదీ పరివాహక గ్రామాలు సూకూరులింగంపల్లి, తంగడిగి, కుసుమూర్తి, కళహళ్ళి, గురుజాల, హిందూపూర్, ముడుమాల్ గ్రామాల్లో పంటల సాగుకు నీరు కరువైంది. దీంతో నది ఒడ్డున రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకొని వరి సాగుకు నీటిని తరలిస్తున్నారు. అయినా పంటలకు నీరు అందక ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు మంత్రులు, ఎమ్మెల్యేలు కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధిరామయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యను వివరించి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. దీంతో కర్ణాటక ప్రభుత్వం రెండు టీఎంసీల నీటిని విడుదల చేసింది. ఆ నీరు కృష్ణ మండల పరిధిలోని కృష్ణా, భీమా నదులకు వచ్చి చేరుతోంది. దీంతో స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తుమ్మిళ్ల లిఫ్ట్‌కు సహకరించాలి



ఎస్ఈ ద్వారకానాథ్‌తో పాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూరు చౌరస్తా, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తుమ్మిళ్ల లిఫ్ట్‌కు నీరు విడుదల చేయాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కోరారు. అందుకోసం కేసీ కెనాల్‌కు రెండు రోజుల పాటు నీటి విడుదలను నిలిపి వేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ద్వారకానాథ్ రెడ్డిని సోమవారం ఆయన కలిసి మాట్లాడారు. తుంగభద్ర డ్యాం నుంచి వస్తున్న వెయ్యి క్యూసెక్కుల నీరు నేరుగా కేసీ కెనాల్‌కు వెళ్తోందని తెలిపారు. తుమ్మిళ్ల లిఫ్టు మోటార్‌కు నీరు అందకపోవడంతో ఆర్డీఎస్ ఆయకట్టు కింద పంటలు ఎండి పోతున్నాయని తెలిపారు. అందుకు ఎస్ఈ సానుకూలంగా స్పందించారు. కేసీ కెనాల్‌కు మంగళ, బుధవారాల్లో నీటి విడుదలను నిలిపివేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు, నాయకులు పుల్లూరు నాగేశ్వర్ రెడ్డి, వావిలాల రంగారెడ్డి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆధ్యాత్మికతతో మానసిక ఆనందం



తిరుమలలో అఖండ భజనలో పర్దిపురం భజన బృందం

అయిజటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికతతో మనిషికి మానసిక ఆనందం ఉంటుందని అయిజ మునిసిపాలిటీకి చెందిన పర్దిపురం భజన బృందం సభ్యులు అన్నారు. తిరుమల తిరుపతిలో జరుగుతున్న అఖండ హరి నామ సంకీర్తన భజనలో సోమవారం పాల్గొని భక్తి గీతాలు ఆలపించినట్లు వారు తెలిపారు. ప్రతి ఏటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. భజన బృందం గురువు ఆంజనేయులుతో పాటు సభ్యులు వీరేష్, నర్సింహులు, కుమార్, నారాయణగౌడు, ఏకాంతం తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల మెటీరియల్ పంపిణీ



పరిక్షల మెటీరియల్ అందుకున్న పాఠశాల విద్యార్థులు

అయిజ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అయిజ మండల పరిధిలోని మేడికొండ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందచేశారు. గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి చాంద్‌బాషా తన కూతురు జోహ పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం 46 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్ళు, జామెట్రీబాక్స్‌తో పాటు పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను అందించారు. పాఠశాల నుంచి టాపర్‌గా నిలిచిన ఇద్దరు విద్యార్థులకు ప్రోత్సాహం కింద నగదు అందచేయనున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయులు తిమ్మప్ప, ఏబేలు, రామనాయుడు, నర్సింహులు, రుక్మత్, జగదీష్, రూతు, అనుపమలు, గ్రామస్థులు మహబూబ్‌బాషా, మేరాజ్, ఫరాజ్, మదీహ, మదియాన్, అయాన్, షైబు, ఉశేని పాల్గొన్నారు.

పది అంతర్గత మార్కుల ర్యాండం పరిశీలనకు ప్రత్యేక బృందం

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశానుసారం పదో తరగతి అంతర్గత మార్కుల 5 శాతం ర్యాండం పరిశీలన కొరకు జిల్లాలో ముగ్గురు సభ్యులున్న ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు జిల్లా విద్యా శాఖాధికారి అబ్దుల్ ఘని, జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బృందంలో ఒక ఎంఈవో, సీనియర్ జీహెచ్ఎం, డీసీఈబీ (డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్) సెక్రటరీ ఉంటారని తెలిపారు.

కాగా జిల్లా వ్యాప్తంగా 27 బృందాల పర్యవేక్షణలో 161 పాఠశాలల్లో 7,600 మంది పదో తరగతి విద్యార్థుల 20 అంతర్గత మార్కులను పరిశీలించామని వివరించారు. ర్యాండం తనిఖీ పకడ్బందీగా నిర్వహించి పదో తరగతి బోర్డుకు ఆన్‌లైన్ ద్వారా అంతర్గత మార్కుల వివరాలను అప్‌లోడ్ చేస్తామని చెప్పారు.

ఇంటర్ విద్యార్థి జీవితం మలుపు తిప్పుతుంది



వీడ్కోలు సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు

మానవపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జీవీ ధర్మారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతమ్మ మాట్లాడుతూ ఇంటర్ విద్య ప్రతీ విద్యార్థి జీవితం మలుపు తీరుగుతుందని, ఉన్నత స్థాయిని పొందాలంటే ఇంటర్ పూర్తి చేసుకుని క్రమశిక్షణగా ఉండాలని, చెడుమార్గానికి వెళ్లకుండా చదువుపట్ల ఆసక్తిని పెంచుకుని ముందుకువెళ్లాలని ఆమె అన్నారు. అనంతరం విద్యార్థులు ఉపన్యాసాలు, నృత్య ప్రదర్శన చేసి రెండు సంవత్సరాలుగా కళాశాలలో చదువుకున్న విద్యార్థులు వారి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

బీజేపీని కాంగ్రెస్ ఎదుర్కోలేదు



సమావేశంలో మాట్లడుతున్న సీపీఎం రమణ

అలంపూరుచౌరస్తా, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీని కాంగ్రెస్ ఎదుర్కోలేకపోతున్నదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమణ అన్నారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలో అయన ఆ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసినా మాట్లాడలేదన్నారు. వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చేతులెత్తేసిందని అన్నారు. మండల నాయకులు వెంకటేశ్వర్లు, రాజు, పరంజ్యోతి, నరసింహ, నర్మద, రమేష్ తదితరులు ఉన్నారు.

ఆదమరిచారో.. అంతే!

క్లిక్.. క్లిక్..



కృష్ణవేణిచౌరస్తా - నల్లకుంట మార్గంలో ప్రమాదకరంగా ఉన్న శిథిలమైన కల్వర్టు

వామ్మో.. ఈ దారిపై ప్రయాణం ప్రమాదకరం.. ఈ కల్వర్టు శిథిలావస్థకు చేరినా ఎవరూ పట్టించుకోరు.. ప్రమాదాలు సంభవించినా అధికారుల్లో చలనం లేకుండా ఉన్నది. దీనిపై వెళ్లేందుకు పలువురు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. గద్వాలలోని కృష్ణవేణి చౌరస్తా-నల్లకుంట మార్గంలో ఓ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారింది. ఏమాత్రం ఆదమరిచి అదుపు తప్పినా వాహనాలు కల్వర్టులోకి వెళ్లాల్సిందే. ఇది వరకే ఈ కల్వర్టుపై పలు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పటికీ పుర పాలక అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- గద్వాల సర్కిల్, (ఆంధ్రజ్యోతి)

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

» కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 22 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల

జిల్లాలో ఈనెల 24 నుంచి 28 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించి బ్యాంకు లావాదేవీలపై మహిళలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు పొదుపు, బ్యాంకులలో ఖాతాను తెరువడం, బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం తదితర 65 అంశాలపై వారం రోజుల పాట జిల్లాలోని అన్ని మండల కేంద్రంలో బ్యాంకర్లు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, అధికారులు ఉన్నారు.

కులగణన సర్వే డబ్బులు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి

» అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న హోలియాదాసరుల సంఘం నాయకులు

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కులగణన సర్వేకు సంబంధించిన డబ్బులు ఇంతవరకు ఇవ్వలేదని సోమవారం బాధితులు కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫహీమ్, ఫాజిల్‌లు మాట్లాడుతూ... గత ఏడాది నవంబరులో కుటుంబ కులగణన సర్వేకు సంబంధించి డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా జిల్లాలో కొంత మందిని విధులు నిర్వహించామని, అయితే సర్వే చేసి రిపోర్టులు ఇచ్చినప్పటికీ ఇంతవరకు అందుకు సంబంధించిన డబ్బులు ఇవ్వలేదని వెంటనే ఇచ్చేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతపత్రాన్ని అందజేశారు.

● అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

జిల్లాలోని అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పలయ్య సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఆగడాలు రోజురోజుకు పెరిగి పోతూ సరైన విద్యార్హతలేని టీచర్లతో తక్కువ జీతాలు ఇస్తూ నాణ్యమైన విద్యను అందించడం లేద న్నారు. కేవలం అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను చిత్రహింసలు పెడుతున్నారన్నారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని, ఎంఈవోల పర్యవేక్షణ కరువైందని వారు తనిఖీలు జరిపేలా చూడాలని కోరారు.



కులగణన సర్వే డబ్బులు ఇవ్వాలని ఆందోళన తెలుపుతున్న బాధితులు

హోలియాదాసరులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో వెనుకబడిన హోలియాదాసరులకు అ త్యధికంగా ఇళ్లను కేటాయించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రామచందర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వా రు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వపరంగా వచ్చే పథకాలలో అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న హో లియా దాసరులకు ప్రాధాన్యం ఇవ్వాలని, అలా గే వారికి కుల సర్టిఫికెట్లను ఆర్డీవో కార్యాలయం లో కొత్తరూల్స్ వల్ల జాప్యం అవుతున్నందున కలెక్టర్ స్పందించి త్వరగా వచ్చేలా చూడాలన్నా రు. హోలియా దాసరి కులానికి కమిటీ హాలు గద్వాల పట్టణంలో కేటాయించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించా రు. ఉమ్మడి జిల్లా ఉపకులాల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉరుకుందు, హోలియాదాసరి సంఘం సీ నియర్ నాయకులు కృష్ణ, నాయకులు మన్నెంకొండ, జమ్మన్న, ఉప్పు కృష్ణ, విజయ్, వెంకటేష్, ఆకుల బుచ్చన్న, కొండల్, ప్రవీణ్ ఉన్నారు.

శ్రీశైలానికి శివభక్తులు



బింగిదొడ్డి నుంచి శ్రీశైలం వెళ్లిన శివస్వాములు

అయిజ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అయిజ మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామానికి చెందిన శివస్వాములు ఇరుముడితో శ్రీశైలం వెళ్లారు. సోమవారం ఉదయం గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి ధరించారు. భాజా భజంత్రీలతో పుర వీధులలో శోభాయాత్రగా శ్రీశైలం వెళ్లారు.

అయిజ పట్టణంలో నిఘా పెంచండి

» బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి



స్టేషన్‌లో పోలీసు అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అయిజటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అయిజ పట్టణంలో నిఘావ్యవస్థను పటిష్టం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి సోమవారం అయిజలోని పోలీస్‌స్టేషన్‌లో అయన వినతిపత్రం అందజేశారు. ఇటీవల కాలంలో అయిజ పట్టణంలో ఆకతాయిల అల్లరి చేష్టలు ఎక్కువయ్యాయని తెలిపారు. ముఖ్యంగా కొందరు యువకులు రాత్రిళ్ల మద్యం తాగి ద్విచక్ర వాహనాలను ఇష్టారీతిన నడుపుతున్నారని వారు విన్నవించారు. దీనివల్ల మహిళలు, చిన్న పిల్లలు ఏదైనా అత్యవసరాలకు కూడా రోడ్లమీదకు రావాలంటే భయపడుతున్నట్లు తెలిపారు. కొంతమంది ఆటోలకు సంబంధించిన వ్యక్తులు కూడా రాత్రి కొత్తబసాండ్ ప్రాంతంలో ఎక్కువ సౌండ్‌తో ఒక్క టైరుమీద వాహనం నడుపుతూ భయభ్రాంతులు కలిగిస్తున్నారన్నారు. గత వారం రోజుల క్రితం కూడా కొందరు ఆకతాయిలు పాతబస్టాండ్ ఏరియాలో జాతర పర్వదినం సందర్భంగా కట్టిన బ్యానర్‌లను చింపివేశారని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా పెద్దపట్టణంగా అభివృద్ధి చెందిన అయిజలోని ప్రధాన ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని, దీన్ని అలుసుగా తీసుకుని కొందరు ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు ఆది, రాజశేఖర్, నర్సింహులు, రఘు, బీమేష్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

రైతులకు అవగాహన

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా సాయం పొందే రైతులకు బీజేపీ నాయకులు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం 19వ విడతగా సోమవారం రూ.2000లను విడుదల చేసిన సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు, అయిజ పట్టణానికి చెందిన పలువురు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాల గురించి వివరించటంతో పాటు, వ్యవసాయానికి కావలసిన ఎరువులకు అందుతున్న సబ్సిడీల గురించి రైతులకు తెలిపారు.

బాధితుల ఫిర్యాదులపై చర్యలు చేపట్టాలి

» ఎస్పీ శ్రీనివాసరావు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని ఎస్పీ శ్రీనివాసరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 మందితో ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భూ వివాదాలకు సంబంధించిన, కొడుకులు తల్లిదండ్రులను చూడక పోవడం, అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కార ఫిర్యాదులు, లైంగిక వేధింపులు, భర్త వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్ఐ, సీఐలను ఆదేశించారు. డీఎస్పీ మొగిలయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణే విద్యార్థికి మొదటి పాఠం

» డీఐఈవో హృదయరాజు



డీఐఈవో హృదయరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అలంపూరుచౌరస్తా, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి క్రమశిక్షణే మొదటి పాఠంగా భావించాలని, ఆ క్రమశిక్షణ జీవిత కాలం ఉండాలని డీఐఈవో హృదయరాజు అన్నారు. ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలోని మహాత్మజ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో సోమవారం పదవ తరగతి, ఇంటర్ రెండవ ఏడాది విద్యార్థులకై నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి హాజరయ్యారు. తల్లిదండ్రులతో పాటు సమాజం పట్ల కూడా బాధ్యతగా మెలగాలని ఎంఈవో రామకృష్ణ అన్నారు. ప్రతి విద్యార్థి విజయం కన్నవారికి చదివిన పాఠశాలకు గౌరవం తెచ్చేలా ఉండాలని ప్రిన్సిపాల్ దేవానందం అన్నారు. డీఐఈవోను ఉపాధ్యాయులు సన్మానించారు.

సమయం వృథా చేయొద్దు

» ఎంఈవో రవీంద్రబాబు



రేవులపల్లి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

ధరూరు/మానవపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాబోయే పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని సమయాన్ని వృథా చేయకుండా చదవాలని ఎంఈవో రవీంద్రబాబు విద్యార్థులకు సూచించారు. సోమవారం ధరూరు మండల పరిధిలోని రేవులపల్లి జడ్పీహెచ్ఎస్, సోంపురం ప్రాథమిక పాఠశాల, రేవులపల్లి డ్యాం ప్రాథమిక పాఠశాల, ఎములోనిపల్లి పాఠశాలలను ఎంఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులతో ఎంఈవో మాట్లాడారు. టీవీ, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంటూ కేవలం పరీక్షలపై మాత్రమే దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు సూచించిన విధంగా ప్రతి సబ్జెక్టును చదవాలన్నారు. సోంపురం ప్రాథమిక పాఠశాలలో ఉదయం ప్రార్థనకు హాజరైన ఎంఈవో విద్యార్థినీ విద్యార్థులకు ఆపార్ నెంబర్ నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రేవులపల్లి డ్యాం ప్రాథమిక పాఠశాల, ఎములోనిపల్లి పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైనది ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

పాఠశాల సమయానికి ఉపాధ్యాయులు హాజరుకాకుంటే చర్యలు తప్పవని మానవపాడు ఎంఈవో శివప్రసాద్ అన్నారు.

సోమవారం మండల పరిధిలోని కోర్విపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రార్థన సమయానికి పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు.

ఇంటి స్థలాల విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని జర్నలిస్టుల ఆందోళన



కలెక్టరేట్ ముందు జర్నలిస్టులు

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాల సమస్యలను పరిష్కరించా లని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గిరి బాబు మాట్లాడుతూ... ఇంటి స్థలాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రివ్యూ పిటిషన్ వేసి వాదనలు చేయాలన్నారు. జర్నలిస్టులకు తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే కొత్త విధానం ద్వారా ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ఆరోగ్యబీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఉద్యోగుల మాదిరిగా అమలు చేయాలని, జర్నలిస్టుల కంట్రిబ్యూషన్‌ను ప్రభు త్వం భరించాలన్నారు.

కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులకు కొత్త కార్డులను ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. జర్నలిస్టులు ముకుంద రావు, వెంకట్రావు, నాగరాజు, సురేష్ తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు



ముస్తాబవుతున్న అయిజ పట్టణంలోని గుంతరామలింగేశ్వరాలయం

అయిజ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 26వ తేదీ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివపార్వతి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తేదీ మంగళవారంతో పూర్తి కానున్నాయి. ప్రధానంగా అయిజలోని గుంతరామలింగేశ్వర, నీలకంఠేశ్వర, ఈశ్వర, పులికల్, సింధనూర్ గ్రామాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధ మయ్యారు. రాత్రి ఆలయాలలో శివపార్వతుల కల్యాణం నిర్వహించతలపెట్టారు. భక్తాదులకు ఉచిత భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు.